సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 23 । జనవరి । 2023



రూ.50 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి నిత్యాన్నదానం ట్రస్టుకు మణిశంకర్ శ్రీనివాస్, రమ్య దంపతులు (అమలాపురం) రూ.50,001 విరాళం సమర్పించారు.



మేధకు పదును

'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీ సెమీఫైనల్స్ ఆదివారం ఉత్సాహంగా జరిగాయి.

- 8లో▸

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సీహెచ్ వంశీ లక్ష్మీపతిరాజు, అఖల (మలికిపురం) రూ.లక్ష, గొట్టుముక్కల శ్రీహరిరాజు, వెంకట సుబ్బలక్ష్మి వరలక్ష్మి (నర్సాపురం) రూ.50 వేల చొప్పున విరాళం సమర్పించారు.

న్యూస్‌రీల్

ఏకాదశ రుద్ర ప్రభల నమూనా సిద్ధం



రిపబ్లిక్ డే నాడు ప్రదర్శించబోయే ఏకాదశ రుద్ర ప్రభల నమూనా

అంబాజీపేట: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని ఈ నెల 26న న్యూఢిల్లీలో ప్రదర్శించబోయే ఏకాదశ రుద్ర ప్రభల నమూనా సిద్ధమయింది. కోనసీమ రుద్రప్రభలతో పాటు గరగ నృత్యాలు, హరిదాసులు, డోలు సన్నాయి వాయిద్యాలు, జోడెడ్లబండ్లు, వింజామరలతో పరమేశ్వరునికి సేవచేసే నమూనాలను సిద్ధం చేశారు.

కిక్కిరిసిన విఘ్నేశ్వరుని ఆలయం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకులు వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి లఘున్యాస అభిషేకాల్లోను, లక్ష్మీగణపతిహోమంలోను భక్త దంపతులు పాల్గొన్నారు. నూతన వాహనాలకు పూజలు చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనం ద్వారా రూ.8,500, అన్నప్రసాదాలకు వచ్చిన విరాళాలు రూ.76,509, వివిధ సేవలకు రూ.22,000, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.25,000, వివిధ విరాళాల ద్వారా రూ.18,000 లభించిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

ఖతార్ నుంచి స్వగ్రామానికి మృతదేహం



హేమలత మృతదేహం పంపడంలో సాయం చేస్తున్న బుల్లబ్బాయి, శశికిరణ్

సఖినేటిపల్లి: జీవనోపాధి కోసం ఖతార్ వెళ్లిన గుడిమూలకు చెందిన కోన హేమలత ప్రమాదవశాత్తూ బాత్రూములో జారిపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఖతార్ టీసీఎఫ్ చర్చి, ఏపీఎన్ఆర్టీఎస్ కతార్ శాఖ సంయుక్త సహకారంతో స్వగ్రామానికి ఆమె మృతదేహాన్ని పంపినట్టు ఖతార్ వైఎస్సార్ సీపీ కన్వీనర్, రామేశ్వరానికి చెందిన దొండపాటి శశికిరణ్ ఆదివారం తెలిపారు. కాగా ఆమె మృతిపై బంధువుల ద్వారా ఇటీవల సమాచారం తెలుసుకున్న టీసీఎఫ్ సంఘం, చర్చి పాస్టర్ బిషప్ ఓగూరి బుల్లబ్బాయి(మోరి), ఆమె పనిచేసే కంపెనీతోను, ఖతార్ రాయబార కార్యాలయంతోనూ మాట్లాడారు. ఇమ్మిగ్రేషన్, ఇతర పనులు పూర్తి చేసి భౌతికకాయాన్ని విమానంలో భారతదేశానికి పంపారన్నారు. భారతదేశంలో ఏపీఎన్ఆర్టీఎస్ అంబులెన్స్ సౌకర్యం స్వగ్రామం గుడిమూల వరకూ ఏర్పాటు చేసిందని శశికిరణ్ చెప్పారు.

సేవా వైద్యులకు వందనం

- ఇక నెలనెలా సత్కారాలు
- ఐదుగురి చొప్పున డాక్టర్ల ఎంపిక



కాట్రేనికోనలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు

సాక్షి అమలాపురం: 'ఫ్యామిలీ ఫిజీషియన్' విజయవంతం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో వీరి ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలందించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో ఉత్తమ వైద్య సేవలందిస్తున్న ఐదుగురిని ఎంపిక చేసి ప్రతి నెలా సత్కరించాలని నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాల్లో అందిస్తున్న వైద్యసేవల ఆధారంగా నెలకు ఒకసారి వీరిని ఎంపిక చేయనున్నారు. ఇలా చేయడం ద్వారా మిగిలిన వైద్యుల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచాలని నిర్ణయించింది. తద్వారా గ్రామీణ ప్రాంతంలోని పేదలకు, దీర్ఘకాలిక రోగాలతో ఇబ్బంది పడుతున్నవారికి మరింత మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

గర్భిణులకు ఇంటి వద్దే వైద్యం

జిల్లాలో గత ఏడాది అక్టోబర్ 21 నుంచి ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు అరంభమయ్యాయి. ఇద్దరు చొప్పున వైద్యులున్నారు. వీరిలో ఒకరు పీహెచ్‌సీలో, రెండవ వైద్యుడు కేటాయించిన గ్రామాలకు వెళ్లి వైద్య సేవలందిస్తున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా జిల్లాలో మెరుగైన వైద్య సేవలందుతున్నాయి. కాట్రేనికోన, ఐ.పోలవరం, ఉప్పలగుప్తం, అల్లవరం, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి సముద్ర తీర గ్రామాలకు వెళ్లి వీరు వైద్య సేవలందిస్తున్నారు. గోదావరి మధ్యనున్న లంక వాసులకు సైతం గ్రామంలోనే మెరుగైన వైద్యం అందుతోంది. ఆయా గ్రామాల్లో ఓపీ 100 నుంచి 150 వరకూ ఉంటుండడం గమనార్హం. ఇదే సమయంలో దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి ఇళ్ల వద్దనే చికిత్స పొందుతున్న రోగులు, గర్భిణులు గడప దాటకుండా వైద్య సేవలు పొందుతున్నారు. వైద్యంతో పాటు పరీక్షలు, మందులు అందజేస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం రోగిని దగ్గర ఉండి తరలిస్తున్నారు.

రోజువారీ సేవలు ఆన్‌లైన్

ఫ్యామిలీ ఫిజీషియన్‌లో మెరుగైన సేవలందిస్తున్న తొలి ఐదుగురిని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గుర్తించారు. ఓపీ, ఇళ్లకు వెళ్లి అందిస్తున్న సేవలు, మందుల పంపిణీని ఏ రోజుకారోజు ఆన్‌లైన్ చేస్తున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ కమిషనరేట్ జిల్లా నుంచి ఆత్రేయపురం పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ దివ్యపావని, రాజోలు మండలం తాటిపాక పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సీహెచ్.ఆర్.ఎస్. ఫణికిరణ్, కాట్రేనికోన పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ పి.నీలిమ, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సుమలత, ఐ.పోలవరం మండలం కేశన్నకుర్రు పీహెచ్‌సీ వైద్యుడు ఆదిత్య పవన్‌ను ఎంపిక చేసింది. సంక్రాంతి పండగ ముందు రోజు వీరిని కలెక్టర్ హిమాన్షు శుక్లా, డీఎంహెచ్ఓ ఎం.దుర్గారావుదొర, అడిషనల్ డీఎంహెచ్ఓ పి.కె.శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు.

దీర్ఘకాలిక రోగులకు సేవ



ఆత్రేయపురం మండలం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దివ్య పావని పేరవరం, ఉచ్చిలి, వద్దిపర్రు, బొబ్బర్లంక, వెలిచేరు గ్రామాల్లో సేవలందిస్తున్నారు. రోజుకు 100 నుంచి 150 వరకు ఓపీలు ఉండగా, 15 ఇళ్ల వద్దకు వెళ్లి దీర్ఘకాలిక రోగులకు, గర్భిణులకు సేవలందిస్తున్నారు.

రోజుకు 160 వరకు ఓపీ



ఐ.పోలవరం మండలంలో కేశనకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆదిత్య పవన్ ఐ.పోలవరం-2, కొమరగిరి, మురమళ్ల-1 గ్రామాల్లో సేవలందిస్తున్నారు. రోజుకు ఓపీ 140 నుంచి 160 వరకు ఉంటుంది.

సదస్సులతో అవగాహన



తాటిపాక పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ సి.హెచ్.ఆర్.ఎస్.ఫణికిరణ్ తన పరిధిలోని వేగివారిపాలెం, కడలి-2, తాటిపాక-2, రాజోలు-3,4, శివకోడు-2 సచివాలయాల్లో సేవలందిస్తున్నారు. ఓపీ ఎక్కువ ఉండడంతోపాటు ఎన్‌సీడీసీడీ స్క్రీనింగ్ ఎక్కువగా నిర్వహిస్తారు. బాల్య వివాహాలపై అవగాహన సదస్సులు అధికంగా నిర్వహిస్తున్నారు.

మత్స్యకారులకు మెరుగ్గా



కాట్రేనికోన పీహెచ్‌సీ వైద్యురాలు పి.నీలిమ తన పరిధిలో రోజు విడిచి రోజు ఎంపిక చేసిన గ్రామాల్లో వైద్య సేవలందిస్తున్నారు. ఉప్పుడు, పల్లం-1, పల్లం-2 గ్రామాల్లో ఓపీ ఎక్కువ నమోదవుతోంది. పూర్తి మత్స్యకార గ్రామమైన పల్లంలో మెరుగైన వైద్యసేవలందిస్తున్నారు.

ఇంటి వద్దే చికిత్స



చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారిగా ఉన్న ఎం.సుమలత ఆలమూరు మండలంలోని మూలస్థానం అగ్రహారం, చెవ్వుడులంక, బడుగువానిలంక, మడికి, నర్శిపూడి, గుమ్మిలేరు, మోదుకూరు గ్రామాల్లో వైద్య సేవలందిస్తున్నారు. రోజుకు 120 నుంచి 150 వరకు ఓపీ ఉంటోంది. ఇంటి వద్ద దీర్ఘకాలిక రోగులకు మెరుగైన సేవలందిస్తున్నారు.

ప్రపంచ అగ్రగామి దేశాల్లో భారత్ ఒకటి

జాతీయ కార్యవాహ వారణాసి రాంమాధవ్



కిమ్స్‌లో జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభిస్తున్న రాంమాధవ్

అమలాపురం రూరల్: ప్రపంచ అగ్రగామి దేశాల్లో భారత్ ఒకటని ఆర్ఎస్ఎస్ జాతీయ కార్యవాహ వారణాసి రాంమాధవ్ అన్నారు. అమలాపురం ఆర్ఎస్ఎస్ నగర శాఖ ఆధ్వర్యంలో సాంఘిక్ సమావేశం సర్ సీవీ రామన్ స్కూల్ ఆవరణలో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి మాధవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మార్గనిర్దేశం చేశారు. సమాజానికి, దేశానికి నష్టం కలిగించే వారితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరి విభాగ్ సంఘ్ నాయకులు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోదశి గంగరాజు, ప్రముఖ పారిశ్రామిక వేత్త నందేపు వెంకటేశ్వరరావు, బిల్డర్ అశోకవర్మ, అమలాపురం నగర ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు కేవీ రమణ, నందెపు వెంకటేశ్వరరావు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. కిమ్స్ మెడికల్ కాలేజీలో మేధావుల సమాలోచన వేదిక కార్యక్రమాన్ని రాంమాధవ్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కిమ్స్ విద్యాసంస్థల అధినేత చైతన్యరాజు, న్యాయవాది కూచిమంచి మల్లపరాజు పాల్గొన్నారు.

రెండోసారి దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శాంతి

అమలాపురం రూరల్: దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బండారులంకకు చెందిన పిచ్చిక శాంతికి రెండోసారి అవకాశం లభించింది. పదవీ కాలాన్ని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆమె ఆదివారం తెలిపారు.

సమయం లేదు మిత్రమా..

- ఎల్ఆర్‌కు 31 వరకూ గడువు
- ఇదే చివరి చాన్స్
- పెండింగ్‌లో ఉన్న 249 దరఖాస్తులు
- వారందరూ స్పందిస్తే మరో రూ.2 కోట్ల రాబడి
- ఇప్పటికే రూ.12 కోట్ల ఆదాయం

పట్టణాల వారీగా ఎల్ఆర్ఎస్ ప్రగతి

మున్సిపాలిటీ	వచ్చిన దరఖాస్తులు	పరిష్కారమైనవి	పెండింగ్	ఆదాయం
అమలాపురం	286	251	17	రూ.5.29 కోట్లు
రామచంద్రపురం	22	8	6	రూ.20.64 లక్షలు
మండపేట	698	364	211	రూ.5.79 కోట్లు
ముమ్మిడివరం	176	112	15	రూ.72.94 లక్షలు

అమలాపురం టౌన్: లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్)కు ఈ నెల 31వ తేదీ చివరి గడువుగా పట్టణ, గ్రామీణ ప్రణాళిక శాఖ డైరెక్టరేట్ ప్రకటించింది. ఈ స్కీమ్‌లో ఇక గడువు పెంపు ఉండదని.. ఇదే చివరి అవకాశమని స్పష్టం చేసింది. ఈ స్కీమ్ కింద ఏ ఒక్క దరఖాస్తూ పెండింగ్‌లో లేకుండా సంబంధిత యజమానులతో చర్చించి, అవగాహన కల్పించాలని ఆదేశించింది. దీంతో జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలతో పాటు ముమ్మిడివరం నగర పంచాయతీలో పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి కమిషనర్లు, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులు తుది కసరత్తు మొదలు పెట్టారు. జిల్లాలోని పట్టణాల్లో 249 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నెలలో మిగిలిన రోజుల్లో పెండింగ్ దరఖాస్తుదారులు స్పందించి ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకుంటే రూ.2 కోట్ల వరకూ ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 735 మంది అనధికార లే అవుట్ రియల్టర్లు, ప్లాట్లదారులు ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకున్నారు. ఆయా మున్సిపాలిటీలకు రూ.12 కోట్ల మేర ఆదాయం సమకూరింది.

అనధికార లే అవుట్లతో పాట్లు

అనధికార లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఇళ్ల నిర్మాణాలకు ఎటువంటి అనుమతులూ రాకుండా అవస్థలు పడుతున్నారు. 2019 ఆగస్టు 31 నాటికి ఈ తరహా ప్లాట్లు కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వారికి క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించారు. వీరికి 2020 డిసెంబర్ 31 వరకూ ఎల్ఆర్ఎస్ ద్వారా అవకాశాలు ఇస్తూ వచ్చారు. ఆ తర్వాత ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్వీకరణ నిలిపివేసి వాటి పరిష్కార ప్రక్రియ మొదలు పెట్టారు. జిల్లాలో ఈ స్కీమ్ ద్వారా మొత్తం 1,182 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 735 పరిష్కరించారు. ఫీజు చెల్లించాలని 58 మందికి నోటీసులు ఇచ్చారు. వివిధ సాంకేతిక కారణాలతో 71 దరఖాస్తులను తిరస్కరించారు. వివిధ పత్రాలు సమర్పించని కారణంగా 69 దరఖాస్తులను షార్ట్ ఫాల్‌లో ఉంచారు.

అవగాహన కల్పిస్తాం



చివరి అవకాశంగా గడువును పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా మిగిలిన దరఖాస్తుదారుల్లో అవగాహన కల్పిస్తాం. మున్సిపాలిటీల టౌన్‌ప్లానింగ్ విభాగాల అధికారులు, సిబ్బంది నెలాఖరు వరకు దరఖాస్తుదారులతో చర్చించి ఆదాయం పెంచుకునేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళతాం.

- సీహెచ్ సత్యనారాయణరాజు, ఏడీటీసీపీ, రాజమహేంద్రవరం

ప్రశాంతంగా 'పోలీసు' పరీక్షలు

7,807 మంది హాజరు



పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్, సీఐ కె.శ్రీనివాస్

అమలాపురం టౌన్: పోలీసు ఉద్యోగాల కోసం జిల్లాలోని 18 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రాథమిక పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. హాజరైన అభ్యర్థులను తనిఖీలు నిర్వహించాక పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. పోలీసు ఉద్యోగాల కోసం జిల్లాలో మొత్తం 8,717 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి 1 గంట వరకూ నిర్వహించిన ఈ పరీక్షలకు 7,807 మంది హాజరయ్యారు. 910 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వం, పోలీసు శాఖ పరీక్షల నిర్వహణకు చర్యలు చేపట్టింది. జిల్లాలో మొత్తం 18 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తే అందులో 8 కేంద్రాలు జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలోనే ఏర్పాటు చేశారు. ప్రతీ పరీక్షా కేంద్రం ముందు పోలీసులు మోహరించారు. ఆయా కేంద్రాలకు వచ్చిన అభ్యర్థులను పూర్తిగా తనిఖీ చేశారు. కొంత మంది అభ్యర్థులు తమ చిన్నారి పిల్లలతో పరీక్షా కేంద్రాలకు వద్దకు వచ్చారు. పరీక్షకు వెళ్లే ముందు వారి కూడా వచ్చిన కుటుంబీకులకు పిల్లలను అప్పగించి పరీక్షా హాలులోకి వెళ్లారు. అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం డీఎస్పీలు వై.మాధవరెడ్డి, కె.వెంకటరమణ, ఎం.బాలచంద్రారెడ్డి, అమలాపురం జిల్లా ఎస్పీ కార్యాలయ ఎస్బీ సీఐ కోలా రజనీకుమార్‌తో పాటు ఆయా కేంద్రాల పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పరీక్షా కేంద్రాల బయట పకడ్బందీగా బందోబస్తు నిర్వహించారు.

డెల్టాలకు 9,250 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 9,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు 2,750, సెంట్రల్ 1,900, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.95 అడుగులకు చేరింది.

లోవకు భక్తుల తాకిడి

తుని రూరల్: లోవలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఏడు వేల మంది భక్తులు తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నట్టు ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. పులిహోర, లడ్డూ ప్రసాదాలు, పూజా టికెట్లు, వాహన పూజలు తదితర విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.3,11,545 ఆదాయం సమకూరిందని వివరించారు.

మోగనున్న పెళ్లిబాజా

- రత్నగిరిపై 25 నుంచి పెళ్లి సందడి
- మార్చి 13 వరకూ ముహూర్తాలు
- ఇప్పటికే బుక్కయిన సత్రం గదులు



సత్యగిరిపై ఉన్న ఎంఎస్ రెడ్డి - అంజని ఉచిత వివాహ వేదిక

అన్నవరం: చాలా రోజుల తరువాత రత్నగిరిపై పెళ్లి బాజా మళ్లీ మోగనుంది. మాఘ మాసం ఆరంభం కావడంతో సత్యదేవుని సన్నిధిలో పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. ఇందుకు రత్నగిరి ముస్తాబవుతోంది. ఈ నెల 25న పంచమి, ఉత్తరాభాద్ర నక్షత్రం సుముహూర్తంలో కొండపై భారీగా పెళ్లిళ్లు జరగనున్నాయి. ఫిబ్రవరి 15 వరకూ మాఘ మాసంలోను, తరువాత ఫాల్గుణ మాసంలో మార్చి 13 వరకూ వివాహ ముహూర్తాలు ఉన్నాయి. మాఘంలోనే వందలాదిగా వివాహాలు జరుగుతాయని పండితులు తెలిపారు.

సాధారణంగా వివాహాలకు మాఘమాసం పెట్టింది పేరు. ముహూర్తాలు కుదిరిన జంటలు మాఘం కోసం నిరీక్షిస్తుంటాయి. వాస్తవానికి తెలుగు సంవత్సరంలో చివరిగా వివాహాలు జరిగేది ఈ మాసంలోనే. ఇది శుభప్రదమని ఎక్కువ మంది విశ్వసిస్తారు. చలి కాస్త తగ్గుముఖం పడుతూ.. ఎక్కువగా ఎండ లేకుండా వాతావరణం కూడా అనుకూలంగా ఉంటుందని భావిస్తారు. అందువల్లే ఈ మాసంలో ఎక్కువగా పెళ్లిళ్లు జరుగుతుంటాయి. మాఘ మాసంలో ఈ నెల 25, 26, 27, 28, ఫిబ్రవరి 1, 3, 4, 5, 8, 10, 15 తేదీల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. ప్రధానంగా ఈ నెల 25, 26 తేదీల్లో రత్నగిరిపై సుమారు వంద వివాహాలు జరగనున్నాయని పండితులు చెప్పారు. ఈ నేపథ్యంలో దేవస్థానంలోని వివిధ సత్రాల్లో వసతి గదులు, సత్యగిరిపై విష్ణుసదన్‌లోని 36 హాళ్లను ఇప్పటికే వివాహ బృందాలు రిజర్వ్ చేసుకున్నాయని దేవస్థానం అధికారులు తెలిపారు.

- విశాఖపట్నానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంఎస్ రెడ్డి సత్యగిరిపై నిర్మించిన ఎంఎస్ రెడ్డి – అంజని ఉచిత వివాహ వేదికను ఏకకాలంలో 12 పెళ్లిళ్లు జరిగేలా రూపుదిద్దారు. వేద పండితుల సూచనల మేరకు ఈ వివాహ మంటపాలన్నింటినీ తూర్పు దిశగా ఏర్పాటు చేశారు. దీంతో వీటికి డిమాండ్ ఏర్పడింది. నెల రోజులు ముందుగా వివాహ బృందాలు వీటిని రిజర్వ్ చేసుకోవాలి. ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదు. దీంతో ఎక్కువ పెళ్లిబృందాలు ఇందులోనే వివాహాలు చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నాయి. కల్యాణ మంటపంలో ఏర్పాట్లను దాత ఎంఎస్ రెడ్డి ఇప్పటికే పరిశీలించారు.
- మరోపక్క పెద్దాపురానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ లలితా రైస్ ఇండస్ట్రీస్ అధినేతల్లో ఒకరైన మట్టే శ్రీనివాస్ దంపతులు నిర్మించిన ఉచిత ఏసీ కల్యాణ మంటపాన్ని కూడా మాఘ మాసం అన్ని ముహూర్తాల్లోనూ వివాహాలకు రిజర్వ్ చేసుకున్నారు.

అంతకు మించి..

- లక్ష్యానికి మించి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు
- ఉమ్మడి 'తూర్పు'న సేకరణ లక్ష్యం 7.21 మెట్రిక్ టన్నులు
- ఇప్పటికే 7.43 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ
- దళారులకు చెక్ చెప్పిన ప్రభుత్వం
- అడుగడుగునా అన్నదాతకు అండ



కాకినాడ సిటీ: వారు ఆడిందే ఆట.. పాడిందే పాట.. ధాన్యం బాగున్నా.. నాణ్యత అద్భుతంగా ఉన్నా వారెంత చెబితే అంతే రేటు.. సవాలక్ష సాకులు.. పచ్చి సరకు కొనలేమని కొందరు.. క్యాష్‌లో కొంటామని ఇంకొందరు.. ఇలా అన్నదాతలను దగా చేసే దళారులకు రాష్ట్ర ప్రభుత్వం ఈసారి పక్కాగా చెక్ చెప్పింది. ఆరుగాలం శ్రమించే రైతుకు ప్రభుత్వం అండగా నిలిచి, వారి వద్ద ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తుండటంతో దళారుల ఆటకు అడ్డుకట్ట పడింది. రైతులు వరి పైరు కోసిన మరుక్షణమే రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) నుంచి వ్యవసాయ సహాయకులు వచ్చి ధాన్యం నేరుగా కొనుగోలు చేశారు. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాన్ని గడువుకు ముందే అధికార యంత్రాంగం అవలీలగా ఛేదించింది. ప్రభుత్వం మంచి మద్దతు ధర ప్రకటించడంతో రైతులు ధాన్యం విక్రయానికి కదిలి వస్తున్నారు. ఈ నెలాఖరు వరకూ గడువు ఉన్నందున ఇంకా ఎక్కడైనా రైతుల వద్ద ధాన్యం మిగిలి ఉంటే కొనుగోలు చేసేందుకు సిద్ధమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అవసరమైతే ఫిబ్రవరిలో కూడా కొనుగోలు చేస్తామని చెబుతున్నారు.

ధాన్యం సేకరణ వివరాలు (మెట్రిక్ టన్నుల్లో...)

జిల్లా	సేకరణ లక్ష్యం	సేకరించిన ధాన్యం	విలువ (రూ.కోట్లలో)	చెల్లింపు (రూ.కోట్లలో)
కాకినాడ	2,16,000	2,42,512	494.57	470.51
తూర్పు గోదావరి	2,35,000	2,48,354	506.63	491.55
కోనసీమ	2,70,000	2,52,418	482.00	445.00
మొత్తం	7,21,000	7,43,284	1,483.20	1,407.06

వెంటవెంటనే చెల్లింపులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రేడ్–ఎ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,060, సాధారణ రకానికి రూ.2,040 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. ఈ మేరకు కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖల అధికారులు విస్తృతంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ధాన్యం సేకరించారు. ఈ మూడు జిల్లాల్లోనూ మొత్తం 7,21,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటికే అంతకు మించి 7,43,284 మెట్రిక్ టన్నుల మేర కొనుగోలు చేశారు. అలాగే, ధాన్యం అమ్మిన రైతులకు రూ.1,483.20 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటి వరకూ రూ.1,407.06 కోట్లు చెల్లించడం గమనార్హం. కాకినాడ జిల్లాలోని తాళ్లరేవు, పెదపూడి, కాకినాడ రూరల్, కాజులూరు, కరప, పెద్దాపురం, సామర్లకోట మండలాల్లో ఈ నెల 18వ తేదీకే ధాన్యం సేకరణ పూర్తయ్యింది. కాకినాడ జిల్లాలో 2.31 లక్షల ఎకరాల్లో రైతులు నాట్లు వేశారు. వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం 2.66 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఇందులో సన్నరకం ధాన్యం, రైతుల అవసరాలు, ప్రైవేటుకు పోను, 2.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు భావించారు. కానీ, అంచనాలకు మించి 2.42 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేశారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సుధాకర్

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఇ.గోకవరంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన తురుం గంగరాజు, అతని భార్య రేవతిల మధ్య మనస్పర్థలు రావడంతో కొంత కాలంగా తరచూ గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో శనివారం రాత్రి గంగరాజు ఇంట్లో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై గంగరాజు సోదరుడు తురుం లోవరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన మరదలు రేవతి, పెద్దిపాలెంకు చెందిన ఆటో డ్రైవర్ ఏసులపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుడికి భార్య రేవతి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ప్రత్తిపాడు ఎస్‌ఐ కె.సుధాకర్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. మృతదేహాన్ని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మూడు ఆలయాల్లో చోరీలు



దొంగతనం జరిగిన అప్పనరామునిలంక శివాలయం

సఖినేటిపల్లి: మండలంలోని రెండు గ్రామాల్లోని మూడు దేవాలయాల్లో శనివారం అర్ధరాత్రి దుండగులు వరుస చోరీలకు పాల్పడ్డారు. అంతర్వేది గుర్రాలక్క, అప్పనరామునిలంక శివాలయం, పక్కనే ఉన్న రామాలయంలోను చోరీలు జరిగాయి. వీటిపై ఆయా ఆలయ పూజారులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ అడపా ఫణిమోహన్ ఆదివారం తెలిపారు. చోరీ సొత్తు విలువ సుమారు రూ.లక్షా 90 వేలు ఉంటుందని అంచనా వేస్తున్నట్టు, ఇందులో 3 కాసుల బంగారం, 3 కేజీల వెండి ఉన్నట్టు చెప్పారు.

మేధకు పదును

- గాడాలలో 'సాక్షి' స్పెల్ బీ సెమీ ఫైనల్స్ నండడి
- తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి విద్యార్థుల హాజరు
- పోటీ పరీక్షలకు ఉపయుక్తం అంటున్న తల్లిదండ్రులు



గాడాల లారల్ గ్లోబల్ హైస్కూల్‌లో 'సాక్షి' స్పెల్‌బీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

మధురపూడి: 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీ సెమీఫైనల్స్ ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. కోరుకొండ మండలం లారల్ హై గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించిన ఈ పరీక్షలకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు వచ్చారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. 20 విద్యాసంస్థలకు చెందిన 208 మంది పాల్గొన్నారు. నాలుగు కేటగిరీల్లో పరీక్ష నిర్వహించారు. ఆంగ్లంపై మంచి పట్టు సాధించవచ్చని, భవిష్యత్తుకు ఉపయుక్తంగా ఉంటుందనే భావనతో తల్లిదండ్రులు వారి పిల్లలను వెంటపెట్టుకొని వచ్చారు.

నాలుగు కేటగిరీలుగా నిర్వహణ

కేటగిరి–1 లో 1,2 తరగతుల విద్యార్థులు, కేటగిరి–2 లో 3,4 తరగతులు, కేటగిరి–3లో 5,6,7 తరగతులు, కేటగిరి–4లో 8,9,10 తరగతులకు చెందిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల్లో దాగిన ప్రతిభను గుర్తించడానికి ఈ పరీక్షలు ఉపయోగపడతాయని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. స్పెల్‌బీ ద్వారా పోటీపరీక్షల్లో పాల్గొనడానికి అవకాశం ఉంటుందని అన్నారు. స్పెల్‌బీ నిర్వహించిన 'సాక్షి' యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. లారల్ హైగ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుబ్రత్ కుమార్‌సారంగి, 'సాక్షి' రీజనల్ మేనేజర్(అడ్మిన్) ఎస్.రమేష్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ (యాడ్స్) కె.ఉమాశంకర్ పర్యవేక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. లారల్ హైగ్లోబల్ పాఠశాల సహకారం అందించింది. దీనికి డ్యూక్స్ వేఫీస్ మెయిన్ స్పాన్సరర్‌గా, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ (రాజమహేంద్రవరం) అసోసియేట్ స్పాన్సరర్‌గా వ్యవహరించాయి.

ఆంగ్లంపై అవగాహన



స్పెల్‌బీ పరీక్ష ఇంగ్లిషు భాషపై అవగాహన పొందడానికి అనుకూలంగా ఉంది. పోటీ పరీక్షలంటే భయం లేకుండా పాల్గొనేందుకు వీలుగా ఉంది.
– రణధీర్ సాయి, 4వ తరగతి విద్యార్థి, లారల్ హైగ్లోబల్ స్కూల్, గాడాల

నైపుణ్యం పెరుగుతుంది



సాక్షి స్పెల్ బీ పరీక్ష ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుంది. విద్యార్థులు మంచి భవిష్యత్‌ను సొంతం చేసుకోవడానికి, విదేశాలకు ఉన్నత చదువుల కోసం వెళ్లడానికి వీలవుతుంది.
– పద్మజ నైనా, తల్లి, కాకినాడ

విదేశీ విద్యకు ఉపయోగం



ఇంగ్లిషులో స్పెల్లింగ్, వకబులరీ చాలా ముఖ్యం. దీన్ని నేర్చుకోవడానికి ఈ పోటీ పరీక్ష దోహదపడుతుంది. పిల్లలు ఉత్సాహంగా పరీక్షకు హాజరయ్యారు.
– రమా మానస, తల్లి, రాజమహేంద్రవరం

నాలెడ్జ్ వచ్చింది



సాక్షి స్పెల్‌బీ పరీక్ష రాయడం ద్వారా నాలెడ్జ్ వచ్చింది. ఇంగ్లిషులో చాలా పదాలు నేర్చుకోవడానికి, స్పెల్లింగ్ మిస్టేక్స్ రాకుండా జాగ్రత్త పడటానికి వీలయింది.
– కె.నిషితా కీర్తి, 8వ తరగతి విద్యార్థి, కోనసీమ విద్యాశ్రమం, ముక్తేశ్వరం

స్పెల్లింగ్ మిస్టేక్స్ రాకుండా



సాక్షి స్పెల్‌బీ పరీక్ష ఇంగ్లిషులో స్పెల్లింగ్ మిస్టేక్స్ రాకుండా ఉపయోగపడుతుంది. ఈ పరీక్షలో పాల్గొనడం ద్వారా నైపుణ్యతను పెంచుకోవడానికి వీలవుతుంది.
– సాత్విక చెందుర్తి, రెండవ తరగతి విదార్థిని, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్, రాజమహేంద్రవరం

ఆంగ్లంపై పట్టు చిక్కుతుంది



స్పెల్‌బీ పరీక్ష ఇంగ్లిషు భాషపై పట్టు సాధించడానికి దోహదపడుతుంది. ఆంగ్లంలో స్పెల్లింగ్‌కు చాలా ప్రాముఖ్యత ఉంది. ఈ పరీక్ష వల్ల స్పెల్లింగ్ తప్పులు లేకుండా విద్యార్థులు రాయగలుగుతారు.
– సుబ్రత్ కుమార్ సారంగి, ప్రిన్సిపాల్, లారల్ హై గ్లోబల్ పాఠశాల, గాడాల

వ్యాకరణంపై పట్టు సాధించవచ్చు



ఇంగ్లిషు వ్యాకరణంలో పట్టును సాధించడానికి ఈ పరీక్ష దోహదపడుతుంది. సెమీ ఫైనల్స్‌లో పాల్గొనడం సంతోషకరంగా ఉంది. పోటీ పరీక్షలు రాయడానికి ఇది ఉపయోగపడుతుంది.
– ఎం.దీపక్, 5 వతరగతి విద్యార్థి, ఆదిత్య స్కూల్, జగన్నాయక్‌పూర్, కాకినాడ

మంచి భవిష్యత్తుకు వీలు



ఈ పరీక్షలో పాల్గొనడం వల్ల మంచి భవిష్యత్తు సాధించడానికి వీలవుతుంది. స్పెల్లింగ్, గ్రామర్‌పై మరింత అవగాహన కలిగింది. ఈ పరీక్షకు కొన్ని రోజుల పాటు ప్రిపేర్ అయ్యాను.
– టి.ఇషాని, 2వ తరగతి విద్యార్థిని, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా.


నైవేద్యాలకని బయలుదేరి కడతేరిపోయారు

ఉండ్రాజవరం/నిడదవోలు రూరల్: నిడదవోలు మండలంలోని కలవచర్ల గ్రామంలో శనివారం రాత్రి బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో తీవ్ర గాయాలైన తల్లి, కొడుకు మృతిచెందినట్టు సమిశ్రగూడెం ఎస్‌ఐ షేక్ సుభానీ ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి ప్రమాదంలో కుమారుడు మరణించగా తణుకు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ తల్లి మృతిచెందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వారి స్వగ్రామమైన ఉండ్రాజవరం మండలం, కె.సావరంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఈ ప్రమాదంలో నార్ని సూర్య వెంకటేష్ (22), అతడి తల్లి నార్ని సత్యవతి (42) మృతి చెందారు. సత్యవతి పుట్టింటి వారు నిడదవోలులో ఆదివారం నైవేద్యాలు పెట్టుకుంటున్నారు. ఈ వేడుకకు హాజరయ్యేందుకు సత్యవతి తన కుమారుడితో కలసి శనివారం రాత్రి హోండా యాక్టివాపై నిడదవోలు బయలుదేరింది. కలవచర్ల వద్ద వారి వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందగా, సత్యవతి తణుకు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. కాగా సత్యవతి కె.సావరంలో సబ్ పోస్ట్‌మాస్టర్‌గా పనిచేస్తున్నారు. ఆమె కుమారుడైన వెంకటేష్ ఎంబీబీఎస్ చదివేందుకు జనవరి 26న ఫిలిప్పీన్స్ వెళ్లాల్సి ఉంది. వెంకటేష్ తండ్రి నార్ని వీర వెంకటరావు ఎల్‌ఐసీ, పోస్టల్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. సత్యవతి, వీరవెంకటరావుల కుమార్తె హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. భార్య, కొడుకు మృతి చెందడంతో వెంకటరావు,ఆయన కుమార్తె కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ముమ్మిడివరం: స్థానిక కొండాలమ్మ చింత 216 జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. అయినవిల్లి మండలం పోతుకుర్రు గ్రామానికి చెందిన ఉయ్యూరి వెంకట విశ్వనాథరాజు(52) శనివారం రాత్రి ఇంటి నుంచి మోటారు సైకిల్‌పై ముమ్మిడివరం వచ్చి ఇంటికి తిరిగి వెళుతుండగా బైపాస్ రోడ్డుపై అమలాపురం నుంచి యానాం వైపు వెళుతున్న కారు వేగంగా ఢీకొనడంతో విశ్వనాథరాజు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య విజయలక్ష్మి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్‌ఐ కె.సురేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సహజత్వం తొణికిస



కోనసీమను ఆవిష్కరించిన చిత్రం

- అమలాపురంలో జాతీయ చిత్ర కళా ప్రదర్శన
- పలు రాష్ట్రాల నుంచి వచ్చిన 234 మందితో చిత్రోత్సవం



పండుటాకు... సహజత్వం ఉట్టిపడేలా వృద్ధాప్యం



బహుమతి ప్రదానం చేసి సత్కరిస్తున్న రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ సత్యశైలజ, ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు తదితరులు

అమలాపురం టౌన్: అక్కడ వందల చిత్రాలు కొలువుదీరాయి. ఒకే వేదికపై వందలాది చేయి తిరిగిన కళాకారులు గీసిన చిత్రాలు ప్రదర్శితమయ్యాయి. భాషలు, సరిహద్దులతో మాకు సంబంధం లేదు. చిత్రానుబంధమే మా అందర్నీ ఏకం చేసిందన్నట్లు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చిత్రకారులు ఈ ప్రదర్శనకు హాజరు కావడమే కాకుండా జాతీయ పోటీలకు వారు వేసిన చిత్రాలు కూడా అక్కడ ప్రదర్శితమయ్యాయి. అమలాపురం శ్రీసత్య సాయి కల్యాణ మంటపంలో ఆదివారం జరిగిన 33వ జాతీయ చిత్ర కళా ప్రదర్శనకు వివిధ రాష్ట్రాల నుంచి 234 మంది చిత్రకారులు హాజరయ్యారు. అప్పటికే పరిషత్ నిర్వహించిన జాతీయ చిత్ర కళా పోటీల్లో విజేతలైన 234 మంది చిత్రాలు అక్కడ ఆవిష్కృతమయ్యాయి. ప్రతీ చిత్రం ఓ సందేశాన్ని ఇచ్చింది. మాటలకందని భావాలు ఎన్నో ఆ చిత్రోత్సవంలో కళాభిమానులను పులకింపచేశాయి. కోనసీమ చిత్ర కళా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరసాల సీతారామస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతీయ చిత్ర కళా ప్రదర్శనను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో వసంతరాయుడు చిత్రోత్సవాన్ని తిలకించారు.

బహుమతి ప్రదానోత్సవం

జాతీయ చిత్ర కళా ప్రదర్శన అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బహుమతులు అందజేశారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, శిల్పి రాజ్ కుమార్ వుడయార్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని పాల్గొన్నారు.

మొదటి ప్రయత్నంలోనే విజేతనయ్యా



చిత్రకారుడిగా ఎన్నో చిత్రాలు గీశాను. పోటీలకు వెళ్లాను. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న మొదటి ప్రయత్నంలోనే విజేతగా నిలిచాను. కోనసీమ చిత్ర కళా పరిషత్ నిర్వహించిన జాతీయ చిత్ర కళా పోటీల్లో నా చిత్రం ప్రముఖ చిత్రకారుడు పీఆర్ రాజు పేరుతో అవార్డు, బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. చిత్రకళాకారులకు ప్రోత్సాహపరంగా ఇంతకంటే ఏమి కావాలి.
– కొత్తపల్లి విశ్వనాథ్, చిత్రకారుడు, హైదరాబాద్

కర్ణాటకలో ఈ తరహా ప్రోత్సాహం లేదు



కోనసీమ చిత్ర కళా పరిషత్ దేశంలోని పలు రాష్ట్రాల చిత్రకారులను ఆహ్వానించడం ఓ చిత్రకారుడిగా చాలా గర్వంగా ఉంది. మా కర్ణాటక రాష్ట్రంలో చిత్రకారులకు ఈ తరహా ప్రోత్సాహం లేదు. అమలాపురం జాతీయ చిత్ర కళా ప్రదర్శనకు రావడం ఇదే తొలిసారి.
– జగదీష్, చిత్రకారుడు, రాయచూర్, కర్ణాటక రాష్ట్రం

చిత్ర కళా పరిషత్‌లతోనే గుర్తింపు



కోనసీమ చిత్ర కళా పరిషత్ వంటి కొన్ని పరిషత్‌లు మాత్రమే చిత్ర కళను ప్రోత్సహిస్తూ చిత్రకారుల ఉనికిని కాపాడుతున్నాయి. ఇక్కడ జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనడం, చిత్ర ప్రదర్శనకు రావడం ఇది రెండోసారి. నేను గీసిన చిత్రానికి ఆర్ట్ లెజెండ్ అవార్డు వచ్చింది.
– పి.కాశీమ్, చిత్రకారుడు, కంభం, ప్రకాశం జిల్లా

కోనసీమ కొబ్బరిపై చిత్రాన్ని గీసి అవార్డు సాధించా



కొబ్బరి సీమ...కోనసీమ పేరుతో పంచ భూతాలు కనిపించేలా నేను గీసిన చిత్రం కోనసీమ చిత్ర కళా పరిషత్ జాతీయ పోటీల్లో ఆర్ట్ లెజెండ్ అవార్డును తెచ్చిపెట్టింది. నేను తిరుపతి వాసిని అయినప్పటికీ కోనసీమ కొబ్బరి చెట్ల ఆహ్లాదంపై నాకున్న అవగాహనతో చిత్రాన్ని గీశాను.
– జి.గాయత్రీదేవి, చిత్రకారిణి, తిరుపతి

విద్యుత్ షాక్‌తో సచివాలయ ఉద్యోగి మృతి



మృతుడు లక్ష్మయ్య

తొండంగి: గ్రామ శివారులో విద్యుత్‌షాక్‌కు గురై కృష్ణాపురం గ్రామ సచివాలయ ఉద్యోగి జేఎల్‌ఎం కరణం లక్ష్మయ(38) మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్‌ఐ ఎస్.రవికుమార్ ఆదివారం తెలిపారు. వివారల్లోకి వెళితే.. తొండంగి శివారులో శనివారం అర్ధరాత్రి విద్యుత్‌లైన్ మరమ్మతులకు గురైంది. దీంతో జేఎల్‌ఎం కరణం లక్ష్మయ్య మరమ్మతులు చేసేందుకు స్తంభం ఎక్కి విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. అతడిని స్థానికులు తొండంగి పీహెచ్‌సీకి తరలించి అక్కడి నుంచి తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలిస్తుండగా లక్ష్మయ్య మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా తుని ఏరియా ఆస్పత్రి వద్ద లక్ష్మయ్య కుటుంబానికి న్యాయం చేయాలంటూ గ్రామ సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. న్యాయం చేసేందుకు మృతుడి కుటుంబ సభ్యులతో విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు చర్చలు జరిపినట్టు ఎస్‌ఐ వివరించారు.

లారీని ఢీకొని యువకుడి మరణం

రావులపాలెం: గౌతమి కొత్త బ్రిడ్జిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని కొత్తపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఒక యువకుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా, తణుకు మండలం, తేతలి గ్రామానికి చెందిన దినకొండ మోహన వంశీకృష్ణ(20), మరో యువకుడు పెన్మత్స సాయికృష్ణంరాజు మోటారు సైకిల్‌పై జొన్నాడ వైపు నుంచి జాతీయ రహదారిపై రావులపాలెం వైపు వస్తున్నారు. గౌతమి కొత్త బ్రిడ్జిపై వారి ముందు వెళుతున్న లారీని తప్పించబోయి ఢీ కొట్టారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో కొత్తపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో శీకృష్ణ మృతి చెందాడు. మరో యువకుడు సాయికృష్ణంరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించినట్టు ఎస్‌ఐ ఎం. వెంకటరమణ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

పది పరీక్ష ఫీజుకు గడువు పెంపు

రాయవరం: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లింపు, ఆన్‌లైన్‌లో నామినల్ రోల్ సమర్పించేందుకు తత్కాల్ పథకం కింద గడువు తేదీ పెంచారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్వీ రవిసాగర్ తెలిపారు. రూ.500 అపరాధ రుసుంతో ఈ నెల 23 నుంచి 26 వరకు, రూ.1,000 అపరాధ రుసుంతో ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు అవకాశముందన్నారు. ఇతర వివరాలకు బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చునన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ కుమారుడి అదృశ్యం



అదృశ్యమైన తేజారెడ్డి (ఫైల్)

కాకినాడ రూరల్: కాకినాడ ఆశ్రమ పబ్లిక్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న పెదపూడి పోలీసుస్టేషన్‌లోని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డి కుమారుడు తేజారెడ్డి అదృశ్యం అయ్యాడు. శనివారం ఉదయం 9 గంటలకు రమణయ్యపేటలోని ఇంటి నుంచి స్కూల్‌కు బయలుదేరిన తేజారెడ్డి తరువాత నుంచి కనిపించలేదు. సాయంత్రం తిరిగి రాకపోయేసరికి కంగారు పడిన తల్లిదండ్రులు ఆశ్రమ స్కూల్‌లో వాకబు చేయగా స్కూల్‌కు హాజరుకాలేదని తెలిసింది. దీంతో స్నేహితులు, కుటుంబ సభ్యులు, ఇరుగు, పొరుగువారికి సమాచారం ఇచ్చి ఆచూకీ కోసం అన్వేషిస్తున్నారు. సర్పవరం పోలీసుస్టేషన్‌లో శ్రీనివాసరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని రైటర్ నాగేశ్వరరావు తెలిపారు. మరో వైపు మా అబ్బాయి కనిపించడంలేదని, ఆచూకీ తెలపాలని శ్రీనివాసరెడ్డి సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్టింగ్‌లు వైరల్ అయ్యాయి.

అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఏవీఏ అప్పారావు రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం ఊరు,పేరు తెలియని సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి నాలుగు రోజులుగా అక్కడే ఉంటున్నాడు. ఎవరైనా ఆహారం పెడితే తిని అక్కడే ఉండేవాడు. ఆదివారం ఉదయం సుమారు 11గంటల సమయంలో అనారోగ్యంతో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ వచ్చి ఎక్కించే సమయంలో మృతి చెందాడు. మృతుడిని మాటల సమయంలో ఏ ఊరు అని అడిగినప్పుడు వైజాగ్‌గా చెప్పినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో మార్చురీలో పోలీసులు భద్రపరిచారు. ఈ మేరకు ప్రకాశంనగర్ పోలీస్‌స్టేషన్ ఏఎస్సై సొంబ కేసు నమోదు చేయగా ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని ఆచూకీ తెలిసినవారు 94407 96582 ఫోన్ నంబర్‌లో తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ఐ పోలవరం: ఎదుర్లంక-యానాం బాలయోగి వారధి పైనుంచి ఆదివారం రాత్రి గుర్తు తెలియని మహిళ గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన గురించి తెలుసుకున్న ఐ పోలవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు.